క్లుప్తంగా

పది విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురంలోని ఎంవీఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి ఫలితాల్లో 593 మార్కులు సాధించిన గుడి భార్గవ్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం పీ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్ రూ.10వేలు చొప్పున మొత్తం రూ.20వేలు నగదు ప్రోత్సాహకాన్ని ఎంఈఓ–2 సునీల్ చేతుల మీదుగా అందజేశారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలోని ఆంజనేయ సీఫుడ్స్ ఫ్యాక్టరీలోని కార్మికులకు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 మంది కార్మికులకు రక్త ,బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారి ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుని మందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏలు ఎస్కే షఫీఉద్దీన్, ఓ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్‌ఎంలు సలోమి, హిమజ, ప్రోగ్రాం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోరింటాకు అలంకారంలో కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): ఆషాడ శుక్రవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గోరింటాకు అలంకారంలో దర్శనమిచ్చారు. 500 కిలోల గోరింటాకు, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు.

జనాభా పెరుగుదలతో అనర్థాలు



నెల్లూరు(అర్బన్): జనాభా పెరుగుదలతో అనర్థాలు సంభవిస్తాయని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులో ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అడిషనల్ డీఎల్‌ఏటీఓ అధికారి ఖాదర్‌వలీ, డెమో అధికారి కనకరత్నం, డీఐఓ ఉమామహేశ్వరి, డాక్టర్ రమేష్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డాక్టర్ వీణాభారతి, ఏఎంఓ నాగార్జునరావు, హెచ్‌ఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా నేత్ర వైద్యశిబిరం రేపు

నెల్లూరు(బృందావనం):గురుపూర్ణిమ మహోత్సవాలను పురస్కరించుకొని సాయిదర్బార్ అద్దాల మందిరంలో మెగా ఉచిత నేత్ర శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలను ఉచితంగా చేయడంతో పాటు మందులను ఇవ్వనున్నామని వివరించారు. వివరాలకు 88856 44118, 95028 49784 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆత్మకూరు: మండలంలోని దేపూరు శివారులోని వ్యవసాయ పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆత్మకూరు ఎస్సై ఎస్కే జిలానీ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.10,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జూదరులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

చినుకు పడేనా.. మెట్ట సేద్యం సాగేనా?

- జూలైలోనూ తగ్గని సెగలు
- ఏకాశి వెళ్లినా సాగని ఏరు
- వర్షాధార పంటల సాగుపై సందిగ్ధం
- ఆందోళనలో మెట్టప్రాంత రైతులు



మెట్టపంటల సాగుకు దుక్కి చేసిన పొలం

పొదలకూరు: ఈ ఏడాది ఏకాశి వెళ్లినా చినుకుజాడ లేకపోవడంతో మెట్టప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. మేలో తొలకరి జల్లులు పడి కొద్దిగా వాతావరణం చల్లబడడంతో మెట్టసేద్యంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. వర్షాలు సకాలంలో కురుస్తాయని, అదునులో మెట్టపంటలు సాగుచేసుకోవచ్చని భావించారు. అయితే జూన్ రెండో వారం నుంచి మళ్లీ ఎండలు మండుతుండడంతో అన్నదాతల్లో ఆశలు ఆవిరయ్యాయి.

సాగుకు రైతుల వెనుకడుగు

సాధారణంగా తొలకరి జల్లులు పడి జూన్ రెండో వారం నుంచి ఎండలు తగ్గిపోతాయి. అయితే ఈ ఏడాది జూలైలోనూ ఎండలు మండుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తూ ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరుతుండగా, ఇక్కడ మాత్రం వర్షం జాడలేదు. ఆకాశం మేఘావృతమై చినుకులు పడకుండానే తేలిపోతుండడంతో మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది పొదలకూరులో ప్రాంతంలో జూన్‌లో సాధారణ వర్షపాతం 54.1 మి.మీ కాగా 115 మి.మీ నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 86.3 మి.మీ, కాగా 175.2 మి.మీ నమోదైంది. గతేడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ రైతులు ఆగస్టులోనే మెట్టచేలు దున్నుకుని సాగుకు సిద్ధం చేసుకున్నారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షపాతమే నమోదు కాకపోవడంతో రైతులు దుక్కులు చేసుకునేందుకు కూడా సాహసించడం లేదు. అక్టోబరు మూడో వారం వరకు మెట్ట పంటల సాగుకు సమయం ఉన్నా వారిలో ఉత్సాహం కనిపించడం లేదు. ఏటా పొదలకూరు ప్రాంతంలో మినుము, పెసర అపరాల పంటలను రైతులు వేల ఎకరాల్లో సాగు చేపడతారు. ఈ ఏడాది ఏకాశి వచ్చినా ఏరు రాలేదని మెట్టపంటల సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

పెట్టుబడులు అధికం కావడంతో..

ఇటీవల కాలంలో ప్రధాన మెట్టపంటలైన మినుము, పెసర సాగు వ్యయం విపరీతంగా పెరిగింది. పురుగు మందులు, దుక్కిదున్నకం, భూముల లీజులు, తదితరాలు కలిపి ఎకరాకు సుమారు రూ.20 వేలపైగా పెట్టుబడులు అవుతున్నాయి. అయితే మినుము, పెసర పంటలు చేతికి వచ్చేసరికి మార్కెట్లో ధరలు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి. ఎకరాకు నాలుగు బస్తాల దిగుబడి వచ్చినా యూడా ధరలు తగ్గితే పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. అంతేకాక ఆశించిన మేర దిగుబడులు వస్తాయనే నమ్మకం కూడా లేకపోవడంతో పప్పు దినుసుల సాగు క్రమంగా తగ్గుముఖం పడుతోంది.

చినుకు జాడ లేదు



ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవు. జూలైలోనూ చినుకు జాడ కనపించడం లేదు. ఎండలు వేసవి కాలాన్ని తలపిస్తున్నాయి. నిమ్మతోటలు కూడా వాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మెట్ట పంటల సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

–జీ.నారాయణరెడ్డి, రైతు, పులికల్లు



చుక్కనీరు లేని చెరువు

కారును ఢీకొన్న ట్రక్కు



మనుబోలు: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద శుక్రవారం సాయంత్రం ముందు వెళుతున్న కారును వెనుకగా మహీంద్ర ట్రక్ ఢీకొంది. దీంతో కారు వెళ్లి డివైడర్‌ను ఢీకొంది. అయితే కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : మండలంలోని విరువూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ డీ సుజాత శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు.

కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు, గండవరం, యల్లాయపాళెం, పద్మనాభసత్రం, రామన్నపాళెం సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ ఎం రాములు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సుధాకర్‌రెడ్డి

ముత్తుకూరు(పొదలకూరు) : కీటక జనిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ శాస్త్రి, హెచ్‌వీ ప్రమీల, ఉపాధ్యాయులు, ఆరోగ్య సహాయకులు బాలకృష్ణ, రాజగోపాల్, నవీన్ ఉష, చంద్రకళ, అమృత పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

వెంకటాచలం: టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా జైలులోని ఖైదీలకు టీబీ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సి చర్యలపై అవగాహన కల్పించారు. విపరీతమైన దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం టీబీ లక్షణాలని తెలిపారు. పొగతాగే, ఆల్కాహాల్ ఎక్కువగా తీసుకునే వారు, 60 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుగుణమ్మ

ముత్తుకూరు(పొదలకూరు) : పంచాయతీల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ గండవరపు సుగుణమ్మ అన్నారు. ముత్తుకూరు మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత శాఖలవారీగా ప్రగతిని అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. అభివృద్ధి పనులతో పాటు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నాగమణి, మండలాధికారులు, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, కోఆప్షన్ సభ్యుడు జమీల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మనుబోలు: గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ జలజాక్షి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని కాగితాలపూరులో ఇంటింటి చెత్త సేకరణను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతి సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. తడిచెత్త నుంచి వర్మికంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంచాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

హత్య కేసును పునర్విచారించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(క్రైమ్): నగరంలో రెండు నెలల క్రితం దారుణహత్యకు గురైన గొల్లపల్లి చిన్నయ్య కేసులో పలు అనుమానాలున్నాయని.. పునర్విచారించి అసలు నిందితులపై చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ సౌజన్యకు వినతిపత్రాన్ని చిన్నయ్య కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మార్పీఎస్ నేతలు గొల్లపల్లి శ్రీనివాసులు, పెంచలయ్య, వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ తదితరులు శుక్రవారం అందజేశారు. తొలుత కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగదు కోసం ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసులో 11 మంది నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ విలేకరులకు వెల్లడించారు. దగదర్తికి చెందిన వీ రమేష్ బెంగళూరులో వ్యాపారాలు చేస్తున్నారు. ఈ నెల 6న కాగులపాడు వద్ద కారులో వెళ్తుండగా రెండు కార్లలో వెంబడిస్తూ వచ్చిన కొందరు అటకాయించి కిడ్నాప్ చేశారు. చిత్తూరు జిల్లాలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి హత్యాయత్నం చేయబోగా వారి బారి నుంచి బాధితుడు తప్పించుకుని వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు విచారణ చేపట్టిన పోలీసులు 11మంది నిందితులను అరెస్ట్ చేశారు.

విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యా వ్యవస్థను ప్రైవేటీకరించి నాశనం చేస్తున్నారని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సెంట్రల్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ శిబాసిన్ ప్రహరాజ్ ఆరోపించారు. కొండాయపాళెం సమీపంలోని పాత ఇన్‌ఫంట్ జీసస్ స్కూల్ ప్రాంగణంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర స్థాయి విద్యార్థుల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు, శ్రీశ్రీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతరాన్ని మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర ఆఫీస్ సెక్రటరీ మొబీనా, మాజీ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్, కేరళ అధ్యక్షురాలు అలీనా, కర్ణాటక కార్యదర్శి అజయ్‌కామత్, రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు శుక్రవారం తెలిపారు. జిల్లాలో పొదలకూరులో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఉందన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికిగానూ వ్యవసాయ సంబంధిత కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన వారు శనివారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భానుడి ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరి



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా పొదలకూరు మెయిన్‌రోడ్డు

పొదలకూరు: జూలైలో కూడా భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాధారణంగా తొలకరి వర్షాలు కురిసి జూలైలో వాతావరణం చల్లబడాలి. కానీ అందుకు భిన్నంగా ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఎండవేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరోవైపు ఎండ దెబ్బకు మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

శాకంబరిగా రాజరాజేశ్వరి



నెల్లూరు(బృందావనం): ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో వెయ్యి కిలోలకు పైగా చిక్కుడు గింజలు, వివిధ కాయగూరలతో కాళికామాత అలంకారంలో కొలువై భక్తులను కటాక్షించారు. రాహుకాల దీపాలను భక్తులు వెలిగించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణాన్ని పఠించారు. ఉభయకర్తలుగా కొలపర్తి వెంకటరమేష్, సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



దిగజారిన నిమ్మధరలు

- లోపించిన కాయల నాణత్య
- ఢిల్లీ మార్కెట్‌కు నిలిచిన ఎగుమతులు



నిమ్మతోట



నాణ్యత లేని నిమ్మకాయలు

పొదలకూరు : మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది నిమ్మ రైతుల పరిస్థితి. ఇప్పటికే నిమ్మ ధరలు పతనమై కోత కూలి ఖర్చులు కూడా రాక రైతులు అల్లాడుతున్నారు. ఈ తరుణంలో నాణ్యత లేని కాయలతో ధరలు మరింత దిగజారడంతో రైతుల మరింత ఢీలా పడుతున్నారు. మార్కెట్‌కు వచ్చే కాయల నాణ్యత లోపించడం వల్ల ఢిల్లీ మార్కెట్‌కు వెళ్లక ధరలు మరింతగా దిగజారుతున్నట్లుగా వ్యాపారులు తెలిపారు. మార్కెట్‌కు వచ్చే కాయలు నాణ్యత లేని కారణంగా ఢిల్లీ మార్కెట్‌కు రోజుకు ఒక్క లారీ కాయలను పంపేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నట్టుగా వారు చెబుతున్నారు. కూలీలను ఏర్పాటు చేసుకుని కోసే కాయల్లో సగానికి పైగా మచ్చలున్నవి వస్తుండడంతో మార్కెట్లో పక్కన పెట్టేస్తున్నారని, నాణ్యత బాగా ఉంటేనే ఢిల్లీ మార్కెట్‌కు ఎగుమతి చేస్తామని, లేదంటే తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

తోటల్లో వదిలేయడం వల్లే..

నిమ్మరైతులు ధరలు లేకపోవడంతో కాయలను చెట్లకు వదిలివేస్తున్నారు. ఈ కారణంగా కాయల నాణ్యత లోపించినట్టుగా తెలుస్తోంది. సాధారణంగా నాలుగు నుంచి ఐదు మాసాలకు కాయలను కోయాల్సి ఉంటుంది. ఆ పైన కోస్తే కాయలు ముదిరి పనికిరాకుండాపోతాయి. దీనికి తోడు కాయలపై మచ్చలు ఏర్పడి వాటిని ఏ మార్కెట్‌లోనూ కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. ధరలు లేని కారణంగా రైతులు కాయలను కోయించేందుకు శ్రద్ధ చూపకపోవడం వల్ల కాయలు ముదిరిపోతున్నాయి. చెట్ల కింద రాలుతున్న కాయలను చూస్తున్న రైతులు వృథాగా వదిలివేయలేక కూలీలను ఏర్పాటు చేసి కోయిస్తే నాణ్యత లేని కాయలు దిగుబడి అవుతున్నాయి. ఈ ఏడాది నిమ్మరైతులు కోలుకోలేని విధంగా నష్టపోవడంతో పాటు ఉన్న కాయలను కూడా కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.